నంబి రివ్యూ

చరిత్ర తిరగరాసిన చిత్రం

బయోపిక్ నిర్మాణంలో మొదటి స్థానం

మిస్సైల్ శాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన ఏరోస్పేస్ ఇంజనీర్ నంబి నారాయణన్ జీవిత కథతో ప్రముఖ తమిళ హీరో, దర్శకుడు ఆర్. మాధవన్ రూపొందించిన ‘రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్’ బాలీవుడ్ చరిత్రనే కాదు, భారతీయ సినిమా చరిత్రనే తిరగ రాసిందంటే అందులో అతిశయోక్తేమీ లేదు. భారతదేశంలో అతి గొప్ప శాస్త్రవేత్తల వరుసలో ముందుండే నంబి నారాయణన్ జీవిత కథకు ఈ చిత్రం అన్ని విధాలా అద్దం పట్టింది. ఈ చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం వహించిన మాధవన్ తమిళంలోనే కాక, ఇటు తెలుగులోనూ, ఆ తర్వాత బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు. మాధవనే ఇందులో నంబి నారాయణన్ పాత్రను కూడా పోషించాడు. పోషించాడు అనడం కంటే ఈ పాత్రలో జీవించాడు అనడం ఉచితంగా ఉంటుంది.

నిజానికి ఈ చిత్రం ఎప్పుడో విడుదల కావాల్సి ఉంది. ఎట్టకేలకు, అన్ని బాలారిష్టాలనూ దాటుకుని, అన్ని అవరోధాలనూ అధిగమించి ఇటీవల విడుదలయింది. రాకెట్ విజ్ఞానంలో ఎంతో ప్రతిభా సామర్థ్యాలు కలిగిన నంబి నారాయణన్ ఈ సైన్స్‌లో మరింత విజ్ఞానం, మరింత అనుభవం సంపాదించాలనే ఏకైక లక్ష్యంతో అమెరికా వెళ్లి, అక్కడ రెండేళ్ల కోర్సును పది నెలల్లోనే పూర్తి చేసి తిరుగులేని గుర్తింపును పొందుతాడు. అమెరికాలోనే పనిచేయాలని అక్కడి ప్రభుత్వం, అధికారులు ఎన్ని విధాల కోరినా, స్వదేశానికి సేవాలనే లక్ష్యంతో ఆయన భారతదేశానికి తిరిగి వస్తాడు. అమెరికాకు చెందిన అంతరిక్ష పరిశోధనా కేంద్రం (నాసా) ఆయనకు మంచి పదవి, భారీ జీతం ఇవ్వజూపినా ఆయన తిరస్కరించి స్వదేశానికి తిరిగి వస్తాడు.

ఇక్కడ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరడం జరుగుతుంది. నిజానికి ఇస్రో పరిస్థితులు ఆయనకు అంత అనుకూలంగా ఉండవు. ఇతర దేశాల సహాయ సహకారాలతో ఇక్కడ రాకెట్ సైన్స్‌ను అభివృద్ధి చేస్తున్న సమయం ఇది. అయితే, భారతదేశం స్వయంగా రాకెట్ సైన్స్‌ను అభివృద్ధి చేయాలన్నది నంబి నారాయణన్ దృఢ సంకల్పం. ఆయన ఆ లక్ష్య సాధనకు అహర్నిశలూ కృషి చేస్తున్న దశలో ఆయన మీద లేనిపోని నేరం మోపడం జరుగుతుంది. ఆయన విదేశాలకు, ముఖ్యంగా పాకిస్థాన్‌కు, ఇస్రో సమాచారాన్ని అందజేస్తున్నారని ఆయనపై ఆరోపణలు చేసి, ఆయనపై కేసు పెట్టి విపరీతంగా హింసిస్తారు. ఆయన చివరికి ఎలా బయటపడిందీ, చివరికి ఏమవుతుందీ అన్నదే స్థూలంగా ఈ చిత్ర కథ.

ఇదొక బయోపిక్. మాధవన్ ఈ పాత్రకు సరిగ్గా సరిపోయాడు. తమిళంలో ఈ చిత్రంలో సూర్య నటించాడు. హిందీ సినిమాలో అయితే, ఒక ముఖ్యమైన పాత్రలో షారుఖ్ ఖాన్ కూడా నటించాడు. సినిమా ఆద్యంతం రక్తి కట్టిస్తుంది. అసలు సిసలు సినిమా లాగానే కథ సాగిపోతుంది. చిత్రం చూసినవారికి నంబి నారాయణన్ మీద గౌరవం పెరగడంతో పాటు, మాధవన్ దర్శకత్వం మీద కూడా గౌరవాభిమానాలు పెరిగిపోతాయనడంలో సందేహం లేదు. ఇటీవలి కాలంలో వచ్చిన బయోపిక్ అన్నింటిలో ఇది మొట్టమొదటి స్థానంలో నిలుస్తుందని చెప్పవచ్చు. వైజ్ఞానిక పరిశోధన రంగంలో కూడా రాజకీయాలు ఎలా ప్రవేశిస్తాయో ఇది కళ్లకు కట్టిస్తుంది. తమిళ, హిందీ భాషల్లోనే కాకుండా ఈ చిత్రాన్ని ఇంగ్లీషులో కూడా నిర్మించారు. సైన్స్ మీద ఆధారపడిన సినిమాలను నిర్మించలేరంటూ భారతదేశ సినీ నిర్మాతలు, దర్శకుల మీద ఉన్న నిందను, అపఖ్యాతిని ఇది తప్పకుండా తొలగిస్తుంది. నిజంగా చూసి తీరాల్సిన సినిమా. ముఖ్యంగా యువత తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది.